# యమభాష

## ఫిబ్రవరి

స్కూళ్ళకు వార్షికోత్సవాల సీజను. ఇద్దరు పెద్దమనుషులు ఇన్నీసు పేటలో ఎవరింటి కోసమో వెతుక్కుంటూ తిరిగి తిరిగి ఎట్టకేలకు ఒక ఇంటి గుమ్మం ఎక్కి తలుపు కొట్టారు.

అప్పుడే సాయంత్రం ఎక్కడికో వెళ్ళిపోతూ భమిడిపాటి కామేశ్వరరావుగారు తలుపు తెరుచుకుని బయటికి వచ్చి 'ఎవరికోసం' అన్నారు.

ఆ ఫలానా తానే అని చెప్పి "నడుస్తూ రోడ్డుమీద మాట్లాడుకుందాం" రమ్మన్నారు.

పెద్ద మనుషు లిద్దరూ అనుసరించారు.

సరిగ్గా- అది ఆయన సుబ్రహ్మణ్యశాస్త్రి గారింటికివెళ్ళి అరుగుమీద కూర్చుని కబుర్లు చెప్పుకునే సమయం.

సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఎదురు చూస్తున్నారు.

కొత్తవారిద్దరితో కామేశ్వర్రావుగారు అరుగుమీదకు వెళ్ళి స్తిమితంగా కూర్చుని "అయ్యా, ఇప్పుడు తమరు వచ్చినపని ఏమిటోచెప్పండి" అన్నారు.

ఇద్దరిలో ఒకరు "మాది వల్లూరు. రేపు 12 తారీఖున మా స్కూలు వార్షికోత్సవం. అందులో ఉపన్యాసానికి తమర్నీ, సుబ్రహ్మణ్యశాస్త్రిగారినీ ఆహ్వానించమని మా హెడ్‌మాస్టరుగారు పంపారు. దయచేసి ఉభయులూ అంగీకరిస్తే కార్యక్రమ పత్రాలు అచ్చు వేయించుకుంటాం" అన్నారు.

కామేశ్వర్రావుగా రందుకుని "వార్షికోత్సవంలో సెక్రటరీ రిపోర్టు, బహుమతి ప్రదానం, చిల్లర నాటకాలు, వీటితోటే తెల్లారిపోతుంది. ఇంక ఉపన్యాసాలకి చోటేదీ? మీకు శ్రమా, మాకు హైరానా.

ఆ నాటకాలకోసం చిట్టితల్లులూ, చిన్నపిల్లలూ నాలుగు గంటలకే వచ్చి ఎవరికీ ఊపిరాడ నివ్వరు.

కనక వార్షికోత్సవాల్లో సాహిత్యోపన్యాసాలు, పోలేరమ్మ జాతరలో పుస్తక భాండాగా రోత్సవం లాంటి వ్యవహారం. కనక ఉపన్యాసాలు పెట్టక లాంఛనంగా కొట్టెయ్యండి" అని సలహా యిచ్చారు.

వచ్చిన వారిలో రెండో ఆయన "అమ్మమ్మా! అలా అనకండి. మీ ఉపన్యాసం కోసం చాలా రోజులనుంచి తహ తహ పడుతున్నాం. కనక తప్పక దయచెయ్యాలి" అన్నాడు. శ్రీపాదవా రందుకుని "అంత కుతూహలంగా వుంటే తప్పక వెడదాం. అయితే తర్వాత కార్యక్రమం ఏమిటో అడగండి?" అన్నారు నవ్వుతూ.

కామేశ్వర్రావుగారు సీరియస్‌గా "మా యెడల మీకు అంత 'ఇది' వుంది గనక మాకుచేసే సత్కారం ఏమిటి?" అన్నారు. పెద్దమనిషి విన కూడని మాట ఏదో విన్నట్టు వులిక్కిపడి "సత్కారమా అండి మీ అంత వారికి ఏం చెయ్యగలం? ఏదో దారి ఖర్చులు, ఆతిథ్యం" అని నసిగాడు. కామేశ్వర్రావుగారికి చిర్రెత్తుకొచ్చింది.

"మీరు దయతో ఖర్చు లిచ్చి బస్సువాళ్ళని, రైలువాళ్ళని సన్మానిస్తున్నారు. బాగుంది. సరే_ రెండు గంటలపాటు సభ్యుల్ని ఆనందంతో ఆలోచనలో ముంచెత్తే మాకు వేదిక దిగాక సోడా అడిగే దిక్కైనా వుండదు.

"పందిరి చివర కూచుని గంగిరెద్దు సన్నాయి వాయించే వాడైనా పాతిక రూపాయ లిస్తేగాని రాడు.

"అది ఎవరూ వినరు కాని వుండాలి. శుభ లాంఛనం. అలాగే వార్షికోత్సవానికి ఇద్దరు బ్రాహ్మణ్యం అవసరం. బాగా మాట్లాడగలిగిన 'నేరానికి' వారు వచ్చి మాట్లాడాలి. లేకపోతే విరసులు.

"ఇదీ తెలుగువారి రసజ్ఞత—

ఇదీ విద్యార్థులకు నేర్పే కవి పండిత పూజ!

పిలిస్తే చాలు పరిగెత్తే మావాళ్ళ ఆత్మగౌరవం!

ఒకటే చెబుతున్నాను వినండి. మేమేకాదు, ఇంకెవర్ని పిలిచినా 58 రూపాయల విలువ తక్కువ కాకుండా నగదు రూపంలోగాని, వస్తు రూపంలోగాని వారి కివ్వండి.

మీరు అవసరమైతే ఏ ఎమ్మెల్యేగారి పార్టీకేనా వందలు ఖర్చు చేస్తారు. కాని ఈ తెలుగుదేశంలో కవి పండితులు కారుచౌక. ఒక పూల దండ చూపిస్తే చాలు పరుగెత్తుకుంటూ వస్తారు. రిక్షా అయినా లేకుండా వెడతారు. గంగిగోవులు. మాట్లాడలేరు.

ఈ స్థితి మారాలి. అంతవరకూ ఏ సభలకు రాము" అని నిష్కర్షగా చెప్పారు.

వచ్చినవారు కొంతసేపు తటపటాయించి, గుసగుసలు పోయి, ఇంకోచోటికి తిరగలేక, సత్కారానికి ఒప్పుకున్నారు.

వల్లూరులో వార్షికోత్సవం అయిదు గంటల కన్నది ఏడు గంటలకు ప్రారంభమయింది.

స్థానిక ఎమ్మెల్యేగారు అధ్యక్షత వహించారు.

ఆయన స్కూలు సంస్థాపకుల్లో ఒక ప్రముఖుని చిత్రం వెల్లడించడం ఆ కార్యక్రమంలో ప్రథమ భాగం.

ఆయన చిత్రగత మహానుభావుడి గురించి నాలుగు మాటలు చెప్పి "ఇట్టి ప్రముఖుని చిత్రపటాన్ని బహిష్కరించే భాగ్యం నాకు కలిగినందుకు చాలా సంతోషం" అని చిత్రంమీది రంగుగుడ్డను తొలగించారు. సభలో చప్పట్లవర్షం! వారి బహిష్కారానికో, ఆవిష్కారానికో తెలియు లేదు.

సాధారణంగా కామేశ్వరరావుగారి ప్రసంగం చివరికి వుంచుతారు. అది ముందయిపోతే సభలో జనం ఉండరని భయం.

శ్రీపాదవారు క్లుప్తంగా దేన్ని గురించో మాట్లాడి కూర్చున్నారు. కామేశ్వరరావుగారు లేచారు, సభలో కల కలం!

"నేను సమృద్ధిగా హాస్యం సరఫరా చేస్తానని మీ ఆశ. చెయ్యలేనని నా నిరాశ. ఎందుచేతనంటే హాస్యం బాగా వుంటుందిగాని హాస్యం గురించి ప్రసంగిస్తే ఏడిసినట్టుంటుంది.

ఒక చిన్ననాటి ముచ్చట జ్ఞాపకం వస్తుంది.

మా వీధిబడి అయ్యవారు. మీది "యమభాష"రా అనేవారు. మేం తెల్లబోయి చూస్తే "వెధవల్లారా! మీరు రాసింది యకారమో, మకారమో తెలియదు. రెండూ తెలియపోతే అది యమ భాష అవుతుంది" అని బుర్రమీద ఒక్క టుచ్చుకునేవారు. అదేమిటండీ అంటే యకారానికి ముందుండవలసిన సున్నా నీ తలకాయంత వుండాలని అర్థం! ఆయన మొట్టికాయ ఇప్పటికీ జ్ఞాపకం- మేం హైస్కూల్లో నిత్యం చూసేదీ దిద్దేదీ అచ్చంగా ఆ యమభాష! నేను ముఖ్యంగా మిమ్మల్ని కోరేదేమిటీ అంటే ఆ యమభాష రాయకుండా వుండడం. తెలుగు అక్షరాలు చాలా అందమైనవి, ముత్యాల్లా. వాటి అందం తెలిస్తే భాష సగం పట్టుపడ్డట్టే-" అని ఇంకా ఏదో చెప్పబోతూ వుండగా చిటపటమని చినుకులు ప్రారంభమయాయి.

ఆయన చిరునవ్వుతో "అక్షరాలా మీ వార్షికోత్సవం సార్థకం అయినందుకు చాలా సంతోషం" అని కూర్చున్నారు.

వర్షంతో ఆ వార్షికోత్సవం చల్లగా ముగిసింది.